# ఇది భగవంతుని యుద్దేశమేనా?

శ్రీ గోపరాజు సీతాదేవి

అది ఒకమాలగూడెం. అక్కడయిండ్లు యిండ్లని చెప్పడానికి సందేహముగానేవుంది. కాని ఏమి చెయ్యను? యిండ్లని చెప్పకతప్పదు. ఆహా! ఏమీ విశ్వమానవ ప్రపంచములో, ఒకజాతిలో, ఒకరు మహోన్నత మేరుశిఖరాల్లోనూ, ఒకరు అథఃపాతాళ పూరిగుడిశల్లోనూ! ఒకరు ఆకలిమంటలతోనూ, ఒకరు అజీర్ణబాధతోనూనా! ఇది భగవంతుని వుద్దేశమేనా?.

ఆ గూడేనికి ఒకపాతిక యిండ్లు వుంటాయి. ఇండ్లచుట్టూ అంతా మురికిరొంపి. వాటినిచేరి వారికీ సాయమేమోనన్నట్లు దోమలు వానిఅఖండ సంతానముతోటి కాపురముంటాయి. అక్కడ ఒకఇంట్లో వెంకి తన నలుగురిబిడ్డలతోటీ, తనభర్తతోటీ కాపురముంటుంది. దానిభర్త రాముడు ఒక రైతుదగ్గర నవుఖరీ. రాముడు యింటికొచ్చేసరికి, గంజికాచి తిరగపోస్తూ యుంటుంది. పిల్లలు చుట్టూ మూగుంటారు గంజికోసం.

రా:-ఈరోజునా ఆ గంజేనా?

వెం:-నువ్వు ప్రొద్దున మొదలు, ఝాముఝాత్రివరకూ పనిచేయుచున్నావు కనుక ఈగంజేనా వుంది. యిందాక వాళ్ల సుబ్బి 'చంటిపిల్లాడికి మూడురోజులనుంచి కూడులేదు కాస్త గంజివుంటెపోస్తూ' అనొచ్చింది ఏమిచెప్పను? అందులోదే కొంచెము పోసేను. మనయింట్లోనూ, నూక లయిపోయినాయి.

రా:-ఊఁ, కామందునడిగి ధాన్యం యిస్తారేమొ, పట్టుకొస్తానులే.

వెం:-ఏమో, ఏమితెస్తావో? యింటిలో గుప్పెడునూకలేనా లేవు. నేను కూలికెళుతున్నానా, పనిచేయించుకున్నవారు వెంటనే డబ్బులియ్యరు. ఏలా బతుకుతామనుకుంటారో!

రా:-వారికేమి వారు మనచేత పని చేయించుకోడమేకాని, మనము తింటున్నామొ, పిల్లలూ మనమూ పస్తుంటున్నామో వారు ఆలోచించనే ఆలోచించరు. అసలు వారికి తెలియనే తెలియదు. వారు ప్రభువులు. మనము బానిసలము. నేను పొలమువెళుతున్నా, అక్కడికే ముంతతీసుకురా.

చక్కనిప్రదేశం. ఒకవంక వరివెన్నులు బంగారు కుచ్చులోయన తలలువంచి చూపరులకు అమితానందము కలుగచేయుచున్నవి. ఒకవంక చేలుకోసి కుప్పలువేయుచున్నారు. ఒకవంక కోతలు కోయుచున్నారు. పైరులుఫలించి, భారతదేశం 'రత్నగర్భ' యను నుడువులు సార్థకం చేయుచున్నది. కానీ తమరు కష్టించి ఫలపర్చిన వస్తుసంపద తన ముద్దుబిడ్డలయిన కర్షకసంతతి పీసమైననూ తినుటలేదని భారతమాత విలపించుచున్నదేమొ యన్నట్లు ఏటేటా వర్షపాతము, సస్యములు కొన్నిటిని పాడుచేయుచునే యున్నది. ఆదిమవాసులకు అపూర్వ కళయిన వ్యవసాయము నేడుశ్రమజీవులకు కొంచెము ఆకలిబాధ నివర్తిస్తున్నది.

రాముడు, ఇంకా కూలిజనులు, కుప్పలువేసిన ధాన్యమునూర్చి బళ్ళమీద కామందు ఇంటికి తీసుకపోతారు. వారిదొక పెద్దమేడ. ఆ ఇంటియజమాని నరసయ్య ఒకకుర్చీలో కూర్చొనుంటారు ఆయాసపడుతూ.

నరసయ్య:-ఒరే రామిగా ధాన్యమంతా యింటికిచేరిందా?

రా:.లేదండి బాబుగారు యింకా రెండుసబుర్లు పడతాయి.

న:-వెలుగుండగానే తోలెయ్యండి.

రా:-చిత్తం బాబు, యీవేళ కూటికిబ్బందిగా వుందండి. యింటికాడ పిల్లలు గంజినీళ్లు తాగుతున్నారు. బాబయ్యగారూ, రెండు కుంచాలు ధాన్యం దయచేయించండి.

న:-అప్పుడే అయిపోయినాయా వారము రోజులక్రిందటేగా రెండుకుంచాలు పట్టుకెళ్లేవు?

రా:-ఎన్నిరోజు లొస్తాయండి? నలుగురు పిల్లలూ, మేము తినాలి.

న:-నీపెళ్ళాము కూలికెళ్లదా? ఆ డబ్బులేం చేస్తారు?

రా:-బాబయ్యా రోజల్లా పాటుపడి పనిచేస్తే బేడ డబ్బులుకూలి. అదేన సమయానికివ్వరు.

నర:-ఈవాళ శుక్రవారం, రేపు అమావాస్య, ఎల్లుండి తీసుకెడుదుగానిలే! పో! ధాన్యం తోలుకురండి, మాటలతోటి వేళమించింది.

రా:-అయ్యగోరూ? పిల్లలు మాడిపోతారండి బాబు!

న:-మీఖర్మం, మేమేమిచెయ్యం? యీవాళియ్యకూడదు, పో!

◆ ◆ ◆ ◆

ఎంతో సేపట్నుంచి కూకున్నాను. ఏజాముకీ రాలేదు. కామందుని ధాన్యం యడిగావేమిటి? యిదిగో! గంజి. శోషవచ్చేలావుంది!

రా:-నాకేమిలే, పిల్లలేలా బ్రతుకుతారు? రెండు రోజులదాక ధాన్యం యియ్యమన్నారు.

వెం:-అంత విచారించి మనమేమి చెయ్యగలం! యివతల పసిపిల్లలు మాడి ఆకలిమంటలకు అహుతి అవుచున్ననూ వారికి మనసు కరుగదు. పోనీ, ముష్టికెళ్లి తెద్దామంటే, మనను అంటరానివారని దగ్గరకు రానివ్వరు. మనము ముష్టి ఎత్తుకోడానికేనా నోచుకోలేదు.

రా:-వెంకీ? ఏది గంజి ఏది? ఇదియే మనకు సమస్త ఫలహారములు, ఇదియే మనము నిత్యమూ సేవనచేయు మధుర రసము.

◆ ◆ ◆ ◆

ఆరోజు జరిగిపోయింది. తిరిగి రోజు వచ్చింది. కూలిజనులంతా ఎవరిపనుల్లోనికి వారు వెళ్లినారు. ఆరోజు యథాప్రకారం జరిగిపోయింది. లోకబాంధవుడు వీరి కష్టాలు చూడలేక కామోసు తల్లిగర్భంలో దాక్కున్నాడు. సంజచీకటులు అలుముకొన్నాయి. ఆ అభాగ్యజీవుల ఆశాహృదయాల్లా చెట్లమీద మిణుగురు పురుగులు; ఘప్పుమని వెంటనే ముణుచుకుపోతున్నాయి.

వెంకి యింట్లో చంటిపిల్ల నోరుయెండేటట్టు ఏడ్చి, కొయ్యబారిపోయింది. వున్నపిల్లలు అమ్మకోసం యెదురు చూస్తూయున్నారు. యీలా ఎన్నిజీవములో! 'ఓప్రభూ! ఇదేటి న్యాయం?'